www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

శనివారం | 16 | మే | 2026

పేజీలు : 8


## నేడు ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా మహాసభ




2లో..

# కాలువపై మళ్లీ కబ్జాలు..!



**నాడు పేదలను తరిమి.. నేడు ఆక్రమణలు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం నగరంలో కాలువలపై మళ్లీ కబ్జాల పర్వం కొనసాగుతుంది. నాగార్జున సాగర్ కాలువలను ఆక్రమించుకున్నారని న్యాయస్థానానికి వెళ్లి పేదలను రోడ్డున పడేసిన వారే తిరిగి స్థలాలను అక్రమించి ఇండ్లు నిర్మించుకోవడం శోచనీయం. ఎక్కడ నిలువ నీడలేని పేదలు కాలువలను ఆక్రమిస్తే తప్పని కేకలు వేసిన పెద్దలే ఇప్పుడు ఆ కాలువను ఆక్రమించుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఖమ్మం నగరం నుంచి 60 అడుగుల మేర నాగార్జున సాగర్ కాలువ ప్రవహిస్తుంది. 25ఏళ్ల క్రితం ఈ కాలువపై ఖమ్మం నగరంలోని నిరుపేదలు, కుటుంబ పోషణార్థం నగరంలోకి వచ్చిన వారు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. దశాబ్ద కాలం తర్వాత ఖమ్మం నగరంలోని కాలువ సమీపంలో నివసిస్తున్న పెద్దలు గుడిసెలను తొలగించాల్సిందేనంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై పేదలు అనేక పోరాటాలు నిర్వహించినా చివరకు వారు వీధిన పడక తప్పలేదు. వీరిలో కొందరికీ పువ్వాడ ఉదయ్ నగర్ దగ్గర, వైఎస్ఆర్ కాలనీలో, ఇతర చోట్ల స్థలాలు కేటాయించారు. మరి కొందరికి నివసించే అవకాశం లేక

మిగతా 2లో..

## 2.18 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు

-తప్పుడు వార్తలతో రైతుల్లో ఆందోళన సృష్టించవద్దు
-ప్రభుత్వం పూర్తి స్థాయిలో పంటను కొనుగోలు చేస్తుంది
-కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లాలో ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో 2.18 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. పత్రికల్లో మొక్కజొన్న కొనుగోలు, లిఫ్టింగ్‌లో జాప్యం జరుగుతుందని ప్రచురితమైన వార్తలు అసంపూర్ణ సమాచారం ఆధారంగా ప్రచురించబడినవని కలెక్టర్ రిజాయిండర్ జారీ చేశారు. జిల్లాలో మొక్కజొన్నల

మిగతా 2లో..

## రూ.64లక్షలు విలువ చేసే గంజాయి పట్టివేత



-ముగ్గురు అంతరాష్ట్ర నిందితులు అరెస్ట్
-వైరా ఏసిపి సారంగపాణి

**ప్రజాపక్షం/వైరా:** వైరా ఎస్సై రామారావు తన సిబ్బందితో కలిసి వైరా మున్సిపాలిటీపరిధిలోని సోమవరం గ్రామం వద్ద ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించేందుకు వెళుతుండగా రోడ్డు ప్రక్కన ఐదు గోనె సంచులతో అనుమానస్పదంగా నిలబడి ఉన్న ముగ్గురు వ్యక్తులను గుర్తించారు. వారిని తనిఖీ చేయగా ఐదు గోనె సంచుల్లో మొత్తం 60 ప్యాకెట్లలో సుమారు రూ.64లక్షలు విలువ చేసే 128 కిలోల ఎండు గంజాయిని ఒరిస్సాలోని మల్కనగిరి ప్రాంతం నుండి తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని

మిగతా 2లో..

# ప్రజలపై భారాలు మోపుతున్న మోడీ



-పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలి : దండి సురేష్
-సిపిఐ ఆధ్వర్యంలో ప్రదర్శన, దిష్టిబొమ్మ దగ్ధం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సేవలో మునిగి సామాన్య ప్రజలపై భారాలు మోపుతుందని ఇందులో భాగంగానే పెట్రోల్, డిజీల్ ధరలు పెంచారని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆరోపించారు. మోడీ ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నారని చెప్పేదానికి చేసేదానికి పొంతన లేకుండా పోతుందని ఆయన తెలిపారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను నిరసిస్తూ శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో సిపిఐ కార్యాలయం నుండి బైపాస్ రోడ్డులో ప్రదర్శన నిర్వహించారు. ఆటోను తాళ్లతో లాగి నిరసన తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల సందర్భంగా ధరలు పెంచబోమని హామీ ఇచ్చిన మోడీ హామీలో తుంగలో తొక్కి పెట్రోల్, డీజిల్ ధరలను పెంచారని రానున్న కాలంలో నిత్యావసర వస్తువుల ధరలను

మిగతా 2లో..

# కాలువపై మళ్లీ కబ్జాలు..!

(మొదటిపేజీ తరువాయి)
ఇప్పటికీ నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆ తర్వాత నగరంలో కాలువ సమీపంలో స్థలాలు కలిగి భవనాలు ఉన్న పెద్దలు జీవో నెం.58, 59 క్రింద రెగ్యులర్ చేయించుకున్నారు. ఆ శకం ముగిసిన తర్వాత ఇప్పుడు 60 అడుగులు కలిగిన ఎన్నెస్పి కాలువను ఇరువైపులా ఉన్న వారు ఆక్రమించడంతో పాటు చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. మరి కొందరైతే ఓ అడుగు ముందుకేసి భవనాలు నిర్మించడం ప్రారంభించారు. పెద్దలకు ఒక రీతి, పేదలకు మరో రీతి అన్న చందంగా అధికార యంత్రాంగం వ్యవహరిస్తుంది. అధికార పార్టీకి అనుకూలురైన నేతలు కావడంతో అధికార యంత్రాంగం ఆ వైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కార్పోరేషన్ అధికారులు తక్షణం స్పందించి ఎన్నెస్పి కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని పేదలు డిమాండ్ చేస్తున్నారు.

**ఆక్రమణలు తొలగించకపోతే ఆందోళన : గాంధీ**
ఆక్రమణలు తొలగించకపోతే సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని సిపిఐ హవేలీ కార్యదర్శి ఏనుగు గాంధీ తెలిపారు. పేదలను ఇబ్బందులు పెట్టేందుకు న్యాయస్థానాల చుట్టూ తిరిగి తొలగించే వరకు నిద్రపోని పెద్దలే ఇప్పుడు తిరిగి ఆక్రమణలకు పాల్పడటం శోచనీయమన్నారు. అధికార యంత్రాంగం పేదల పట్ల ఒక రీతిగా, పెద్దల పట్ల మరో రీతిగా వ్యవహరించడం సరికాదని ఆయన తెలిపారు. అప్పుడు ప్రభుత్వ స్థలమని చెప్పి పేదల గుడిసెలు తొలగించిన అధికారులకు ఇప్పుడు ప్రభుత్వ భూమి కబ్జా కనిపించడం లేదా అని గాంధీ ప్రశ్నించారు. ఆక్రమణలపై కార్పోరేషన్ అధికారులు వెంటనే స్పందించాలని లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే తిరిగి పేదలచే గుడిసెలు వేయిస్తామని ఆయన హెచ్చరించారు.



# ప్రజలపై భారాలు మోపుతున్న మోడీ

(మొదటిపేజీ తరువాయి)
మరింతగా పెంచనున్నారని ఆయన తెలిపారు. పెరిగిన ధరలతో సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు. మోడీ సర్కార్ కేవలం సంపన్న వర్గాల కోసం మాత్రమే పని చేస్తుందని యావత్ దేశాన్ని వారికి తాకట్టు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలతో పాటు పెట్రోల్ ధరలను పరిశీలిస్తే మోడీ అధికారంలోకి వచ్చేనాడు పెట్రోల్ ధర రూ. 60లు ఉందని ఇప్పుడు రూ. 111 కు చేరుకుందని సురేష్ తెలిపారు. డీజిల్ సైతం రూ. 99లకు చేరుకుందని పెట్రో ధరల పెరుగుదల సామాన్యులకు మరింత భారం కానుందన్నారు. రవాణా ఛార్జీలు పెరిగి ఇతరత్రా కూడా అదనపు భారం కానుందన్నారు. పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. మోడీ మాయ ఎంతో కాలం ఈ దేశంలో నిలబడలేదని ప్రజలు వాస్తవికతను అర్థం చేసుకుంటున్నారని సురేష్ తెలిపారు. మోడీ పాలనకు వ్యతిరేకంగా జరిగే ప్రజా ఉద్యమాలకు ప్రజలు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, ఏనుగు గాంధీ, యానాలి సాంబశివరెడ్డి, జిల్లా నాయకులు తాటి నిర్మల, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, వరదా నర్సింహారావు, పోటు పూర్ణ, జ్వాలా నర్సింహారావు, మందా వెంకటేశ్వర్లు, ఉపేందర్, చార్లెస్, బెజవాడ వెంకన్న, నర్సింహారావు రమణయ్య, లద్దు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.64 లక్షలు విలువ చేసే గంజాయి పట్టివేత

(మొదటిపేజీ తరువాయి)
అరెస్ట్ చేశారని వైరా ఏసిపి ఎస్.సారంగపాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వైరా పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతూ మనుయాల్ బోత్ర(22 సంవత్సరాలు), రాబా కాలనీ, దొరగూడ పంచాయతీ, చిత్రకొండ బ్లాక్, మల్కంగిరి జిల్లా, ఒడిశా, చిటికల సన్యాసినాయుడు(25 సంవత్సరాలు), నాతవరం మండలం,అనకాపల్లి జిల్లా, ఆంధ్రప్రదేశ్, లక్ష్మణ్ కిలో (24 సంవత్సరాలు) కమర్గూడ, బోడ పొద్దూర్, చిత్రకొండ పోలీస్‌స్టేషన్ పరిధి, మల్కాంగిరి జిల్లా, ఒడిశా చెందినవారు అని అన్నారు. సమాజాన్ని నాశనం చేస్తున్న మాదకద్రవ్యాల వ్యాపారం, రవాణా, వినియోగం వంటి అక్రమ కార్యకలాపాలపై ఖమ్మం కమిషనరేట్ పోలీసులు కఠినచర్యలు కొనసాగిస్తారు. యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడటం ప్రతిఒక్కరి బాధ్యత. గంజాయి , ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని ప్రజలను కోరుతున్నారు.



డ్రగ్స్‌కు దూరంగా ఉండండి, భవిష్యత్తును కాపాడుకోండి అని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటప్రసాద్, ఎస్సై పుప్పాల రామారావు, అదనపు ఎస్సై పవన్, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రైవేటు వాహనాలకు పోలీస్ సైరన్..!

**-వైరాలో మిస్ యూజ్ చేస్తున్న వాహనదారులు**
**-కార్లు, బైకులకు పోలీస్ సైరన్**

ప్రజాపక్షం/వైరా: ప్రజలు శాంతి భద్రతల పర్యవేక్షణలో కీలకమైంది పోలీస్ సైరన్. ఆ సైరన్ వింటే అక్రమార్కులు, ఆకతాయిలు, దొంగలు ఎవరైనా భయపడాల్సిందే. ఇది మనకు భరోసానిచ్చే పోలీస్ సరైన్ అని చెప్పవచ్చు. కాని ప్రస్తుతం అలాంటి పోలీస్ సైరన్ పోలీస్ వాహనాలకు కాకుండా ఇతర వాహనాలకు కూడా వాడుకుంటూ తప్పుడు మార్గంలో ప్రయాణిస్తున్నారని చెప్పవచ్చును. కొంతమంది కార్లు, ద్విచక్ర వాహనాలకు ఈ సైరన్ ఇప్పుడు వాడటం పట్ల చర్చ జరుగుతుంది. అసలు పోలీస్ సరైన్ ఎందుకు పెట్టుకోవాల్సి వస్తుంది. ఎందుకు దానిని మిస్ యూస్ చేసేవిధంగా ఉపయోగిస్తున్నారు. కొంతమంది కార్లు, ద్విచక్ర వాహనాలకు పోలీస్ సరైన్ పెట్టుకొని తిరుగుతూ ఉన్నారు. మరి కొంత మంది రాజకీయ నాయకుల పేరు చెప్పుకొని వారి కార్లకు పోలీస్ సరైరన్ ఉపయోగిస్తున్నారు. పోలీస్ సరైన్ ఉపయోగించాలి అంటే దానికి సంబంధించిన విషయం తెలిసి ఉండాలి. ఒక పోలీస్ సైరన్ సంబంధం లేని ప్రైవేటు వాహనాలకు ఉపయోగిస్తున్నారు అంటే అది చట్టరీత్యా చాలా పెద్ద తప్పు. కొంతమంది పోలీస్ సరైన్ వింటే మన వాహనాలకు ఎవడు అడ్డురాడు అనే దూరంలో ఉపయోగిస్తున్నట్లు సమాచారం. వైరాలో ఇటీవల కాలంలో ప్రైవేటు వాహనాలు పోలీస్ సైరన్‌తో తిరగడం తరచుగా కనిపిస్తూనే ఉన్నాయి. పోలీస్ అధికారులు వీటిపై దృష్టి పెట్టడం వలన అసలు విషయాలు బయటకు వచ్చే పరిస్థితి కూడా కనిపిస్తూ ఉంది. ముఖ్యంగా కొంతమంది ప్రజాప్రతినిధులు వాహనాలకే పోలీస్ సైరన్ ఉపయోగించే అవకాశం ఉంది. కాని ప్రజాప్రతినిధులతో పాటు కొందరు రాజకీయ నాయకులు కూడా ఈ పోలీస్ సైరన్ ఉపయోగిస్తూ ఉన్నారు. వీరికి ప్రభుత్వం పోలీస్ సైరన్ ఉయోగించవచ్చని ఏమైనా ధృవీకరణ పత్రాలు ఇచ్చిందా, ఎందుకు మరి ఆ విధంగా ఉపయోగిస్తున్నారు. కేవలం ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ప్రభుత్వ అధికారులు, న్యాయమూర్తులు వాహనాలకు మాత్రమే పోలీస్ సైరన్ ఉపయోగిస్తూ ఉంటారు. కాని ఇటీవల కాలంలో రాజకీయ నాయకులు చాలా వరకు వారి వాహనాలకు పోలీస్ సైరన్ ఉపయోగిస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా వైరాలో కిరాయిలకు పంపించే కార్లకు కూడా ఈ సైరన్ ఉపయోగిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో పోలీస్ అధికారులు తనిఖీల్లో పోలీస్ సైరన్ ఉపయోగిస్తున్న పాలుప్రైవేటు వాహనాలను అదుపులోకి తీసుకొని సీజ్ చేసి కేసు నమోదు చేసిన సంఘటన కూడా ఉన్నాయి. అధికారులు ప్రత్యేక నిఘా పెడితే సైరన్ వెనక దాగి ఉన్న నిజాలు బయటకు వస్తాయి.

# నేడు ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా మహాసభ

**-హాజరుకానున్న 500 మంది ప్రతినిధులు**

ప్రజాపక్షం/ ఖమ్మం : తెలంగాణ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ అనుబంధం) ఖమ్మం జిల్లా 22వ మహాసభ శనివారం వైరాలో తుళ్లూరి తులశమ్మ నగర్ (కమ్మ వారి కళ్యాణ మండపం)లో జరగనుందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోటు కళావతి, ఏపూరి లతాదేవి లు తెలిపారు. ఈ మహాసభకు జిల్లా నలుమూలల నుంచి 500 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు వారు తెలిపారు. మహాసభ ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని ఈ మహాసభకు తెలంగాణ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెదునూరి జ్యోతి, జిల్లా విద్యాశాఖాధికారి చైతన్యజైని, మమత ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి పువ్వాడ జయశ్రీ, జిల్లా సంక్షేమ అధికారి వెల్పుల విజేత తో పాటు వైరా మున్సిపల్ ఛైర్మన్ కాపా చంద్రకళ హాజరుకానున్నట్లు వారు తెలిపారు. ప్రస్తుత సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కార మార్గాలపై ఈ మహాసభల్లో చర్చించనున్నట్లు కళావతి, లతాదేవి లు తెలిపారు.

# 2.18 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు

(మొదటిపేజీ తరువాయి)
కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లా యంత్రాంగం, టిజి మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సజావుగా కొనసాగుతుందన్నారు. యాసంగి సీజన్‌లో భారీ స్థాయిలో దిగుబడులు రావడంతో కొన్ని కొనుగోలు కేంద్రాల వద్ద లోడెడ్ వాహనాల కదలికలో తాత్కాలిక ఒత్తిడి ఏర్పడిందన్నారు. అధిక స్టాక్ నిల్వలు, పరిమిత అన్‌లోడింగ్ స్థలాల కారణంగా కొంత ఆలస్యం చోటుచేసుకున్నప్పటికీ సమస్య పరిష్కారానికి యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతతో చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో 2.18 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు జరిగిందని గతంలో ఎన్నడు ఈ స్థాయిలో కొనుగోలు జరగలేదని కలెక్టర్ తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అదనపు రవాణా వాహనాల ఏర్పాటు, ప్రత్యామ్నాయ గోడౌన్ల నిల్వ కేంద్రాలను సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో మొక్కజొన్న, వరి పండించిన రైతులు ఏమైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెం. 1077కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు కలిగిన ధాన్యం, మొక్కజొన్న పంటకు ఎవరైనా కోతలు విధించినా లేక ఇతర సమస్యలు ఉన్న ఫిర్యాదు చేయాలని వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులు అసత్య, అసంపూర్ణ వార్తలను నమ్మవద్దని ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని రిజాయిందర్‌లో స్పష్టం చేశారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై ఆందోళన

ప్రజాపక్షం/ ఖమ్మం : పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై వివిధ రాజకీయ పార్టీలు ఆందోళన నిర్వహించాయి. శుక్రవారం సిపిఎం ఖమ్మం డివిజన్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నెస్పి రోడ్డుపై పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని కోరుతూ ప్రభుత్వ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా విక్రం మాట్లాడుతూ జనం ఓట్లు వేసి గెలిపిస్తే కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతుందని ఆరోపించారు. మోడీ ఇటీవల జరిగిన రాష్ట్రాల ఎన్నికల సందర్భంగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచబోమని ఇచ్చిన హామీని తుంగలో తొక్కి పెట్రోల్, డీజిల్ ధరలను పెంచారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తిరుపతిరావు, భూక్యా శ్రీను, నాగులమీరా, శ్రీనివాస్, పి.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.




# విబి జీ రామ్ జీ పథకాన్ని రద్దు చేయాలి

**-తాటి డిమాండ్**

ప్రజాపక్షం/ ఖమ్మం : విబి జీ రామ్ జీ పథకాన్ని తక్షణం రద్దు చేసి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథాతదంగా కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తాటి వెంకటేశ్వర రావు డిమాండ్ చేశారు. శుక్రవారం తనికెళ్ల గ్రామంలో జాతీయ ఉపాధి హామీ కార్మికులతో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత పేదలను వంచించేందుకే విబి జీ రామ్ జీ పథకాన్ని తీసుకు వచ్చిందని తాటి వెంకటేశ్వర్లు ఆరోపించారు. పాత పద్ధతిలోనే జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించడంతో పాటు పని దినాల సంఖ్యను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు., ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గడల భాస్కర్, వార్డు సభ్యులు వెంకటేశ్వరరావు, పుల్లయ్య, పెద్ద సంఖ్యలో కూలీలు పాల్గొన్నారు.



# ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 151 మంది గైర్హాజర్

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలో జరుగుతున్న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలకు 151 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 3188 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 3037 మంది మాత్రమే పరీక్షలకు హాజరు అయ్యారు. జిల్లా చెదురుమదురు సంఘటనలు జరగకుండా పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

# ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలి

**-తెలంగాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తాటి**



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** విబి జి రామ్ జీ చట్టాన్ని రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు అనుబంధం) ఖమ్మం జిల్లా సమితి అధ్యక్షులు తాటి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కార్మికుల సమస్యలపై దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని వి. వెంకటాయ పాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం విబి జీ రామ్ జీ పథకాన్ని తీసుకు వచ్చిందన్నారు. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించే అవకాశం తగ్గుతుందన్నారు. కార్పొరేట్ శక్తులకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తూ వ్యవసాయ కార్మికులకు అన్యాయం చేస్తుందన్నారు. వెంటనే విబి జీ రామ్ జీ పథకాన్ని రద్దు చేసి మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నూతన విధానంలో పని ప్రదేశంలో రోజుకు రెండు సార్లు ఫోటో తీసే పద్ధతిని తక్షణమే రద్దు చేయాలని కోరారు. పని ప్రదేశాల్లో కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, ఏడాదికి 200 రోజులు పని కల్పించి రోజు వారి వేతనం రూ. 600 చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీస వేతన చట్టం అమలు చేయాలని ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కార్మికులకు రూ. 10 లక్షలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి రావెళ్ల సురేష్, నాయకులు గరిడి రాంబాబు, శాఖమూరి సుధాకర్, నాథం, కంచం లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# నవశకం ఆధ్వర్యంలో సంఘ సేవకులకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/మధిర :** గత సంవత్సరకాలంగా పలు సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల మన్నలను పొందిన ప్రముఖ సేవా సంస్థ నవశకం ఆధ్వర్యంలో సంఘ సేవకుల సన్మాన కార్యక్రమం శుక్రవారం క్లబ్ కాంప్లెక్స్ ఆవరణంలో జరిగింది. ఈ సందర్భంగా మధిరకు చెందిన పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న వ్యక్తులను గుర్తించి వారిని ఘనంగా సన్మానం చేయట జరిగింది. సభాధ్యక్షులు కూరపాటి సురేష్, వ్యవస్థాపక అధ్యక్షులు మేకల రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా డాక్టర్ కోట రాంబాబు పాల్గొని మాట్లాడుతూ సమాజంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న సంఘ సేవకులను సన్మానించటం ఎంతో సంతోషించదగ్గ విషయమన్ని, ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన నవశకం నిర్వాహకులను అభినందించారు. ప్రముఖ సంఘ సేవకులు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, పుల్లఖండం చంద్రశేఖర్, మాధవరపు నాగేశ్వరరావు, మిరియాల వెంకటరమణగుప్తా, తలుపుల వెంకటేశ్వర్లు, లంకా కొండయ్య, దోర్నాల రామకృష్ణ, నిస్సిహారిణి, స్వర్ణకుమారి, వంగవీటి రాజశేఖర్, నకిరికంటి గోవిందు, పల్లపోతు ప్రసాద్, శ్రీపాలశెట్టి వెంకట్రావు, వనమా కిరణ్‌కుమార్, బాబ్లా, యడవల్లి నాగభూషణం, శ్యామారావు తదితరులను సన్మానించటం జరిగింది. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**-జిపి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్‌కు వినతి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ సుధాకర్‌కు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టంగుటూరి నర్సింహారెడ్డి మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే మంజూరు చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ, వారంతపు సెలవులు ఇవ్వాలని కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన డిప్యూటీ కమిషనర్ సుధాకర్ మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు గ్రామ పంచాయతీ సెంట్రల్ ఫండ్ నుండి చెల్లింపులు చేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందని రేపు జరిగే డిపివోల సమావేశంలో తెలియజేసి పెండింగ్ వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చారు. పిఎఫ్, ఈఎస్ఐ, వారంతపు సెలవులు కూడా ఇచ్చేవిధంగా డిపివోలకు ఆదేశాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలను త్వరలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. వెంకట రాజన్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ పిట్టల మల్లయ్య, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, శివశంకర్, షరీం, బద్దె నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మధిర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



**ప్రజాపక్షం/ మధిర :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విద్యా వారోత్సవాల్లో భాగంగా మధిర పట్టణంలోని గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి మిర్యాల వెంకటరమణగుప్త, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కోన ధనికుమార్ శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి విద్య ఎంతో కీలకమని, పుస్తకాలు మనిషికి మంచి మిత్రులని తెలిపారు. గ్రంథాలయాలను విద్యార్థులు, యువత ఎక్కువగా ఉపయోగించుకోవాలని, జ్ఞానం సంపాదించేందుకు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఇలాంటి విద్యా వారోత్సవాలు విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంచడంతో పాటు వారి సృజనాత్మకతను వెలికితీయడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను ప్రశంసిస్తూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నకరికంటి రాజేశ్వరరావు, శ్రీపాలశెట్టి వెంకట్రావు, కాంగ్రెస్ నాయకులు వంటవీటి రాజశేఖర్, నకిరేకంటి గోవింద్, మాధవరపు నాగేశ్వరరావు, లైబ్రేరియన్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# చల్లగుళ్ళ నివాసంలో మంత్రి తుమ్మల సందడి

**-అభిమానుల శుభాకాంక్షల వెల్లువ**
**-'మీ సేవలు జిల్లాకు ఎంతో అవసరం'**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** రాష్ట్ర వ్యవసాయ శాఖా మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం సత్తుపల్లి సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు నివాసంలో సందడి చేశారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 40 వసంతాలు పూర్తయిన సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, తుమ్మల అభిమానులు, ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన అభిమానులు, వ్యవసాయ శాఖ అధికారులు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. "40 ఏళ్ల రాజకీయాల్లో ప్రజల మన్ననలు పొందడం గొప్ప విషయమని, భవిష్యత్తులోనూ మీ సేవలు ఈ జిల్లాకే అవసరమన్నారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుణ్ని కోరుకుంటున్నాం" అంటూ పలువురు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రిగా ఉన్న సమయంలో సత్తుపల్లి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు, జ్ఞాపకాలను మంత్రి తుమ్మల నాయకులతో కలిసి గుర్తు చేసుకున్నారు. తుమ్మలను కలిసిన వారిలో మున్సిపల్ చైర్మన్ రిహానా కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, వినుకొండ కృష్ణ,ఆళ్ళ నాగేశ్వరరావు,దొడ్డాకుల గోపాలరావు, పువ్వాళ్ళ ఉమ, కొప్పుల నరేందర్ రెడ్డి, టోపి శ్రీను తదితరులున్నారు.

# 60 మంది చేసే పని.. 20 మందితో...

**-కార్మికుల కష్టాన్ని దోచుకోకండి : ఏఐటీయూసీ**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలో నిర్మించిన వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో 60 మంది చేయాల్సిన పనిని 20 మందితో చేయిస్తూ కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నారని ఏఐటియూసి నాయకులు ఆరోపించారు. శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సురేష్ నారాయణకు కార్మికులతో కలిసిన యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ కార్మికులకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ, హాస్పిటల్ శానిటేషన్ వర్కర్ యూనియన్ గౌరవ అధ్యక్షులు తడికమళ్ళ యోబులు డిమాండ్ చేశారు. ఆసుపత్రి ప్రారంభించి నెల రోజులైనా 60 మంది చేయాల్సిన పనిని కేవలం 20 మందితో వెట్టిచాకిరి చేయిస్తున్నారని, తక్షణమే సిబ్బందిని పెంచాలని కోరారు. కార్మికుల ఖాతాల్లో పీఎఫ్ జమ కావడం లేదని, ముగ్గురికి అసలు పీఎఫ్ ఖాతాలే తెరవలేదని ఆరోపించారు. వెంటనే పీఎఫ్ ఖాతాలు తెరిచి బకాయిలు జమ చేయాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు కుమారి, యశోద, పద్మ, లక్ష్మి , శ్రీను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీల సమ్మె విజయవంతం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ ఆధ్వర్యంలో ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సత్తుపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి కూలీలు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. మండల పరిధిలోని రామానగరం గ్రామంలో ఉపాధి కూలీలు ఆందోళన చేపట్టి గ్రామపంచాయతీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీకేఎంయూ ఖమ్మం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దండు ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం వచ్చాక ఉపాధి హామీ పథకానికి నిధులు కోత పెట్టి కూలీలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. రెండు పూటలా ఐరిస్ ఫొటో విధానం వల్ల కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, దీన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించి 200 రోజుల పని, రోజుకు రూ.600 కూలి ఇవ్వాలన్నారు. ప్రమాదవశాత్తు గాయపడిన వారికి రూ.లక్ష పరిహారం, మృతిచెందిన వారికి రూ.పది లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించి జి.రాంజీ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సత్తుపల్లి ఎంపిడిఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారం అయ్యేవరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రజల రాజశేఖర్, పాలకుర్తి వీరయ్య, దండు జగన్, తాటి వీరభద్రం, దండు యేసురావు, తోట రాంబాబుతో పాటు 160 మందికి పైగా కూలీలు పాల్గొన్నారు.

# వరి కొయ్యలను కాల్చకండి



**ప్రజాపక్షం/వైరా:** జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్యాలయ్య వైరా మండల పరిధిలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రక్కన నిప్పు అంటించినటువంటి వరి పొలాలను దగ్గర ఉండి స్వయంగా మంటలను ఆర్పడం జరిగింది. వరి కొయ్య కాళ్లకు, మొక్కజొన్నకు పంట కోసిన తర్వాత వ్యర్థాలను తగలబెట్టడం వలన జరిగే అటువంటి నష్టాలను రైతులకు తెలియజేశారు. దీనివలన భూమిలోని భూసారాన్ని పెంపొందించే సూక్ష్మ జీవులు చనిపోవడం జరుగుతుంది. వాతావరణం కాలుష్యం ఏర్పడడానికి ముఖ్య కారణం, అంతేకాకుండా వాటికి చుట్టుప్రక్కల ఉన్నటువంటి దీర్ఘకాలిక పంటలకు నిప్పు అంటుకోవడం వలన నష్టం వాటిల్లుతుంది. కావున రైతులు ఎవరు వరి కొయ్యలను వ్యర్థాలను కాల్చవద్దని జిల్లా వ్యవసాయ అధికారి సూచించారు. పంటను కాల్చినటువంటి రైతుల పైన కూడా కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్, వైరా వ్యవసాయ విస్తరణ అధికారి మేడా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్‌ను ముఖ్యమంత్రి చేసే వరకు పోరాటం

**-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**




**ప్రజాపక్షం/ఖమ్మం :** కెసిఆర్‌ను ముఖ్యమంత్రి చేసే వరకు బిఆర్‌ఎస్ పనిచేస్తుందని కార్యకర్తలు మరింత శ్రమించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం బిఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ అధికార పక్షం కేసులు పెడుతుందని రాబోయే రోజుల్లో మరింతగా ఇబ్బందులు పెట్టే ప్రమాదం ఉందన్నారు. బిఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అత్యంత వేగంగా పూర్తి చేసి పార్టీ నిర్మాణానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని అజయ్‌కుమార్ సూచించారు. గతంలో ఉన్న బేధాభిప్రాయాలను పక్కనపెట్టి 2028 ఎన్నికల్లో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. సభ్యత్వ నమోదు ప్రక్రియకు పరిశీలకులుగా వచ్చిన తక్కెళ్లపల్లి రవీంద్రరావు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని డిజిటల్ పద్ధతిలో పూర్తి చేయాలని ప్రతి ఒక్కరిని పార్టీ నిర్మాణంలో భాగస్వాములను చేసేందుకు కృషి చేయాలన్నారు. మీడియా సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, మాజీ జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, పార్టీ నాయకులు ఆర్‌జెసి కృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

**-ఏడిఏ కొంగర వెంకటేశ్వర్లు**



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** విత్తన డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని ఖమ్మం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం రఘునాథపాలెం రైతు వేదిక నందు మండల విత్తన టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో మండలంలోని విత్తన, పురుగు మందుల ఎరువుల డీలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ కొంగర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విత్తన వ్యాపారం చేసే డీలర్లు తప్పనిసరిగా విత్తన చట్టం ప్రకారం విధి విధానాలను పాటిస్తూ రైతులకు నాణ్యమైన దిగుబడి వచ్చే విత్తనాలను అందించాలన్నారు. ప్రభుత్వం సూచించిన కంపెనీ విత్తనాలను విక్రయించాలన్నారు. కొంత మంది వ్యాపారులు గ్రామాల్లో ముందస్తుగా విత్తన నమోదు చేసుకోవడం జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఇది చట్ట రీత్యా నేరమని వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మండల వ్యవసాయ అధికారి కె. ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ మండలంలోని వాతావరణానికి, నేలకు సంబంధించి, మూడు నాలుగు పంట కాలాల్లో మంచి దిగుబడి వచ్చే నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలన్నారు. విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు అధిక ధరకు విక్రయిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్లు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు

# డెంగ్యూ నివారణే ఉత్తమ రక్షణ

**-జిల్లా వైద్యాఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు**



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** డెంగ్యూ నివారణే ఉత్తమ రక్షణ అని జిల్లా వైద్యాఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి రామారావు తెలిపారు. ప్రతి సంవత్సరం మే 16న 'జాతీయ డెంగ్యూ దినోత్సవం' ను దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని, డెంగ్యూ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, దాని నివారణ చర్యలను విస్తృతంగా తెలియజేయడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం అని పేర్కొన్నారు. డెంగ్యూ వ్యాధి ఏడిస్ దోమ కాటు ద్వారా వ్యాపిస్తుంది అని, ఈ దోమలు ముఖ్యంగా శుభ్రమైన నిల్వ నీటిలో పెరుగుతాయని తెలిపారు. పగటి సమయంలో ఎక్కువగా కుడుతాయని అని జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పులు, కళ్ల వెనుక నొప్పి, వాంతులు, చర్మంపై ఎర్రటి మచ్చలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు. డెంగ్యూ నివారణలో ప్రతి వ్యక్తి బాధ్యత ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, కూలర్లు, డ్రమ్స్, బకెట్లు, ఫ్లవర్ పాట్స్, కొబ్బరి చిప్పలు, టైర్లు వంటి వాటిలో నీరు నిల్వ కాకుండా వారానికి ఒకసారి/ రెండు సార్లు ఫ్రైడే డ్రైడే నిర్వహించాలని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రత ఉంచుకోవాలని, నీటి ట్యాంకులు ఎప్పటికప్పుడు మూతపెట్టాలి అని, పూర్తి చేతులు దుస్తులు ధరించాలని, దోమల నివారణ కోసం దోమతెరలు, దోమల నివారణ మందులు మరియు దోమల కాయిల్స్ ఉపయోగించాలని కోరారు. జ్వరం వచ్చినప్పుడు స్వీయ వైద్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆస్పిరిన్ వంటి టాబ్లెట్లు మందులు వైద్యుల సలహా లేకుండా వాడరాదు అని, పిల్లలు మరియు వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామాలు, పట్టణాల్లో లార్వా నిరోధక కార్యకలాపాలు, పొగమంచు కార్యక్రమాలు, ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా ఆరోగ్యశాఖ సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని కోరారు. జిల్లా మొత్తంలో డెంగ్యూ శాంపిల్స్ 2152, పరీక్షించగా, మూడు పాజిటివ్ కేసులను గుర్తించడం జరిగిందని తెలపారు. మన ఇంటి పరిశుభ్రత మన ఆరోగ్య భద్రత అనే సందేశంతో ప్రతి ఒక్కరూ డెంగ్యూ నివారణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# రాష్ట్రంలోనే సత్తుపల్లి నంబర్ 1

**ఎమ్మెల్యే రాగమయి కృషికి మంత్రుల ప్రశంసలు**




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్ల' పథకం అమలులో సత్తుపల్లి నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానం కైవసం చేసుకోగా, సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి దయానంద్ చేసిన కృషికి మంత్రులు అభినందనలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని గృహ నిర్మాణ శాఖ ప్రధాన కార్యాలయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి సమక్షంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్ నిరంతర పర్యవేక్షణ, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీసుకున్న చర్యలతోనే ఈ అరుదైన గౌరవం దక్కిందని మంత్రులు ప్రశంసించారు. సత్తుపల్లి నియోజకవర్గానికి మొత్తం 3,433 ఇండ్లు మంజూరు కాగా, 3,267 ఇండ్లకు పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో 1,503 పూర్తయ్యాయి. మొత్తం ఇండ్లకు రూ.99.93 కోట్లు మంజూరయ్యాయి. 1,229 ఇళ్లకు గాను 1,160 పూర్తైయి గృహ ప్రవేశాలు జరిగాయి. ఈ సందర్భంగా గృహనిర్మాణ శాఖామాత్యులు పొంగులేటి సత్తుపల్లిలో హౌసింగ్ పనులు శరవేగంగా సాగుతున్నాయని, రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాలకు సత్తుపల్లి ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. పేదలకు సొంతింటి కల నెరవేరుస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యేకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

# నూతన తహసీల్దార్ కార్యాలయ భవనానికి మోక్షమెన్నడో..?



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** ప్రతి నిత్యం వివిధ పనులపై వచ్చే మండల ప్రజలతో తహసీల్దార్ కార్యాలయం రద్దీగా ఉంటుంది. తహసీల్దార్ కార్యాలయం అద్దె భవనంలో ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిరుమలాయపాలెం మండలం 40 గ్రామ పంచాయతీలతో సుదీర్ఘ దూర ప్రాంతాల్లో ఉన్న కాకరవాయి సోలిపురం పైనంపల్లి రాజారం బచ్చోడు సుబ్లేడు హైదర్ సాయి పేట శుద్ద వాగు తండా ఏనుకుంట తండా మంగళ బండ తండా రఘునాథపాలెం గ్రామాలు మండల కేంద్రానికి సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉండగా తహసీల్దార్ కార్యాలయానికి వివిధ పనులకు వచ్చే ప్రజలకు కనీస సౌకర్యాలు లేక కూర్చోవడానికి స్థలం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా రైతులు తమ భూముల క్రయవిక్రయాలు చేసినప్పుడు రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు కుల ఆదాయ ధ్రువపత్రాలు పొందేందుకు మీ సేవలో ఆన్లైన్ చేసిన అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లు సరైన సమయానికి ధ్రువపత్రాలు ఆన్లైన్ చెయ్యకపోవడం వలన గంటలు తరబడి వేచి ఉండాల్సి వస్తుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. గతంలో ఉన్న తాహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరటంతో అద్దె భవనంలో ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం కొనసాగుతుంది. అద్దె భవనాలు కనీస సౌకర్యాలు ఇరుకు గదులతో రెవెన్యూ అధికారులు సిబ్బంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెంటనే నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి నూతన తహసీల్దార్ కార్యాలయానికి శంకుస్థాపన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండలంలోని ముత్యాలగూడెంలో రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో కౌలు రైతుల సమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. కౌలు రైతుల పరిస్థితులు, వారికి అందుతున్న వ్యవసాయ రాయితీలపై స్వరాజ్య వేదిక బృందం వివరాలు సేకరించింది. ఈసందర్భంగా రైతు స్వరాజ్య వేదిక ఫౌండర్ విస్స కిరణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కౌలు రైతుల స్థితిగతులపై సమగ్ర సర్వే చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 10 జిల్లాల్లో సర్వే పూర్తి చేసి ఖమ్మం జిల్లాలో కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలోనే అధిక సంఖ్యలో కౌలు రైతులు ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. కౌలు రైతులకు రైతుబంధు వంటి పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై రాష్ట్ర వ్యాప్తంగా రైతులను చైతన్యం చేస్తున్నామని, 15 జిల్లాల్లో సర్వే పూర్తి చేసే వరకు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర నాయకులు బి కొండల్‌రెడ్డి, కార్యకర్తలు ఉమా, మహిత, రైతు సంఘం నాయకులు ఆర్ శివలింగం తదితరులు పాల్గొన్నారు.

# 18న వివోఏల సమ్మెను విజయవంతం చేయండి

**వివోఏల జేఏసీ జిల్లా అధ్యక్షురాలు సుశీల**



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివోఏ ల సమస్యలను పరిష్కరించాలని మే 18న తలపెట్టిన నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని వివోఏల జేఏసీ జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల అన్నారు. 30 40 సంవత్సరాల నుండి కనీస వేతనం అమలు చేయకుండా వివోఏ లతో వెట్టి చాకిరి చేపిస్తూ పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని వెంటనే ప్రభుత్వం స్పందించి వివో ఏ లకు కనీస వేతనం 20 వేల వరకు పెంచి నేరుగా వివోఏల ఖాతాల్లో జమ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పినప్పటికీ క్షేత్రస్థాయిలో సంఘాలను బలోపేతం చేస్తున్న వివోఏ లను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సంఘాల సభ్యులను కోటి మందిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం వివోఏలను మాత్రం కనీస వేతనం అమలు చేయకుండా పని భారాన్ని పెంచుతూ ఇబ్బందుల గురిచేస్తుందని ఆమె తెలిపారు. పాలక ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేర వేయడంతో పాటు ప్రతి ప్రభుత్వ కార్యక్రమాల్లో వివోఏలను భాగస్వాములు చేస్తున్నారని అన్నారు. చాలీచాలని జీతాలతో తమ కుటుంబాలను పోషించుకోవడంలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వెంటనే ప్రభుత్వం స్పందించి వివోఏల సమస్యలను పరిష్కరించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

# ఆహార భద్రత నియమాలు తప్పక పాటించాలి

**- హోటళ్లు, బిర్యానీ పాయింట్లపై ఆకస్మిక తనిఖీ**



**ప్రజాపక్షం/భద్రాచలం :** హోటళ్లు, బిర్యానీ పాయింట్ల వారు ఆహార భద్రతను తూచా తప్పక పాటించాలని జిల్లా ఆహార భద్రత అధికారి శరత్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం భద్రాచలంలోని పలు హోటళ్లు, బిర్యానీ పాయింట్లపై ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటశాల నిర్వహణ, నిల్వ విధానం, లైసెన్సు వలు అంశాలను ఆయన పరిశీలించారు. కొన్ని హోటళ్లు, ఆహార విక్రయ కేంద్రాలు ఎలాంటి లైసెన్సు లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించిన అధికారులు సంబంధిత యాజమాన్యాలు వారం లోగా లైసెన్సులు పొందాలని సూచించారు. హోటల్ ప్రాంగణాలు, వంటశాలలు పరిశుభ్రంగా ఉంచాలని, ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యంగా ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

# సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలి



**- పాలకులు ఇష్టాను సారంగా వ్యవహరించడం సరికాదు**
**- ఏఐకేఎస్ ఆధ్వర్యంలో చర్లలో రాస్తారోకో**

**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని సిపిఐ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ మేరకు గురువారం దుమ్ముగూడెం మండల పార్టీ ఆధ్వర్యంలో ఆ మండల తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా దుమ్ముగూడెం మండల కార్యదర్శి బొల్లోజు వేణు మాట్లాడుతూ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పాలకమండళ్లను దొడ్డిదారిన నియమించడం సరికాదన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రతీ సహకార సంఘంలో పాలకపార్టీకి చెందిన సభ్యులను అధ్యక్షులుగా, డైరక్టర్లుగా నామినేట్ చేయాలని ఉద్దేశ్యంతో ఇష్టాను సారంగా వ్యవహరించడం సరికాదన్నారు. సహకార సంఘంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రైతులు, కార్మికులు ఐక్యంగా పోరాటాలకు సదుంబిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ దుమ్ముగూడెం మండల సహాయ కార్యదర్శి తాటిపూడి రమేష్, సీనియర్ నాయకులు కాకా వంకటేశ్వరరావు, నోముల రామిరెడ్డి, అర్లగూడెం సర్పంచ్ పాయం వెంకటేష్, తూరుబాక సర్పంచ్ అజ్మీర శైలజ, అమరవాది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# వరదలు, అటవి అగ్నిప్రమాదాల నియంత్రణపై టాప్ ఎక్సర్సైజ్



**- మే 18న బూర్గంపాడులో మాక్ ఎక్సర్సైజ్ నిర్వహణ**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వరదలు, విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై శుక్రవారం జిల్లా కలెక్టర్లు,స్థాయి అధికారులతో జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా టాప్ ఎక్సర్సైజ్ నిర్వహించారు. ఈ మేరకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, సిఆర్‌పిఎఫ్ కమాండెంట్ రితికేష్ ఠాకూర్, జిల్లా ఫైర్ అధికారి క్రాంతికుమార్‌తో పాటు డిఎఫ్ఓ, పోలీస్, రెవెన్యూ, ఎస్‌డిఆర్‌ఎఫ్, వైద్య ఆరోగ్యశాఖ, ఇరిగేషన్ అధికారులు ఈ వీడియో కాన్ఫిరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌డిఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేనేజర్ సుధీర్ బహల్ మాట్లాడుతూ జిల్లాలో వరదలు, అటవీ అగ్ని ప్రమాదాలు, ఇతర విపత్తులు సంభవించిన సమయంలో అధికార యంత్రాంగం నేరుగా, సమన్వయంతో స్పందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా వరద ప్రభావిత ప్రాంతంగా గుర్తించబడిన నేపథ్యంలో వరదలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు, అత్యవసర సేవల నిర్వహణ అవసరం అన్నారు. జిల్లాలో అటవీ అగ్ని ప్రమాదాల నివారణ, ప్రమాదాలు సంభవించిన సమయంలో వివిధ శాఖలు సమన్వయంతో ఎలా స్పందించాలి, అగ్నిమాపక చర్యలను ఎలా చేపట్టాలనే అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ నెల 18న బూర్గంపాడు మండలంలో నిర్వహించే మాక్ ఎక్సర్సైజ్‌కు అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. మాక్ డ్రిల్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి అన్ని శాఖల అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన బిఆర్ఎస్ నాయకుల బృందం




**ప్రజాపక్షం/చుంచుపల్లి :** బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు చుంచుపల్లి మండలం పెనగడప రాంపురం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వనమా రాఘవ మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు రైతులను కొనుగోలు కేంద్రాల వద్ద నెలల తరబడి వేచి ఉండే పరిస్థితికి తీసుకువచ్చిందని దుయ్యబట్టారు. వర్షాలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులకు తగిన రక్షణ చర్యలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రాల్లో సరిపడా టార్పలిన్లు కూడా అందుబాటులో లేవని, వెంటనే రైతులకు అవసరమైన వసతులు కల్పించాలని అధికారులను కోరారు. ధాన్యంలో తాలు ఉందని, రంగు మారిందని నాణ్యతా లోపాలు చూపిస్తూ మిల్లర్లతో కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. సొసైటీ అధికారులు, సెక్రటరీలు, ప్రెసిడెంట్లు రైతుల సమస్యలపై స్పందించడం లేదని ప్రశ్నించారు. వెంటనే తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తిస్థాయిలో ప్రారంభించకపోతే బీఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, మాజీ ఉర్దూగర్ చైర్మన్ అన్వర్, యూత్ ప్రెసిడెంట్ కన్నీ, చుంచుపల్లి మండల మైనార్టీ అధ్యక్షులు ఎస్‌కె.హైమద్, పార్టీ నాయకులు నవతన్, రుక్మెంధర్, ప్రసాద్, పాషా, జగన్, పెనగడప వార్డు మెంబర్ ఎండి ఆఫ్సర్ బేగం, ఎస్‌కె.యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వెంకటేశ్వరస్వామి 44వ తిరునక్షత్ర వేడుకలు



**-భక్తులతో కిటకిటలాడిన అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయం**



**ప్రజాపక్షం/ఏన్కూరు:** ఏన్కూరు మండల పరిధిలోని రేపల్లెవాడ, నాచారం గ్రామాల మధ్య గల గుట్టపై స్వయంభువుగా వెలసిన శ్రీశ్రీశ్రీ అద్భుత వెంకటేశ్వర స్వామివారి 44వ తిరునక్షత్ర మహోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేడుకలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు మొగిలి శ్రీనివాసరెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించగా, ఆలయ అర్చకులు వాటిని స్వామివారికి అలంకరించారు. ఆలయ ప్రాంగణాన్ని మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. ఉదయం అర్చకులు మేలుకొలుపు, సుప్రభాత సేవలతో కార్యక్రమాలను ప్రారంభించి, ఆరాధన, సేవాకాలం, నివేదన, మంగళశాసనం నిర్వహించారు. అనంతరం స్వామివారికి 108 కలశాలతో అభిషేకాలు చేశారు. యాగశాలలో చంగీ హోమం నిర్వహించారు. మండలంతో పాటు పరిసర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి, ఆలయ ప్రాంగణంలో మహా అన్నదానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ నిర్వహణ అధికారి ఎస్‌వీడీ ప్రసాద్, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నేలకొండపల్లి మండల కేంద్రంలో ఉపాధి హామీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం భారీ నిరసన చేపట్టారు. దేశ వ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి కాశబోయిన అయోధ్య పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా రోజువారీ కూలీని పెంచాలని కోరారు. పని ప్రదేశంలో నీడ, మంచినీరు వంటి కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని విమర్శించారు. కార్మికుల హక్కుల కోసం క్షేత్రస్థాయిలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని నేలకొండపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వర్‌రావు, నాయకులు ఎస్.కె. సలాం, మూడు శ్రీనివాసరావు, కొండ్రుగట్ల నాగరాజు మరియు పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

# సహకార సంఘ సభ్యులకు విత్తనోత్పత్తిపై అవగాహన



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** కృషి విజ్ఞాన కేంద్రం భద్రాద్రి కొత్తగూడెం వారు జూలూరుపాడు మండలపరిధిలోని సాయిరాం తండా గ్రామంలో వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘ సభ్యులకు విత్తనోత్పత్తి పై అవగాహనా అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కృషి విజ్ఞాన కేంద్రం డా. టి. భరత్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు మార్కెట్ లో డిమాండ్ ఉన్న వరి రకాలు ముఖ్యంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు విడుదల చేసిన రకాలను ఎంచుకొని సాగు చేసుకోవాలని చెప్పారు. అలాగే ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నడుస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం భద్రాద్రి కొత్తగూడెం వారి సాంకేతిక సహకారంతో వరి మరియు కంది లో విత్తన ఉత్పత్తి చేపడుతున్న వివరాలు రైతులకు తెలియపరిచారు. ఈ సందర్భంగా జూలూరుపాడు వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘ అధ్యక్షులు కొమ్మిన్ని పాండు మాట్లాడుతూ రైతులు పోటీతత్వంతో మోతాదుకు మించి ఎరువులను వాడకం చెయ్యడం వలన భూసారం తగ్గిపోతుందని తెలియపరిచారు. పచ్చిరొట్ట పైర్లు జీలుగ, జనుము, పిల్లిపెసర, పెసర, మినుము వంటి వాటిని సాగు చేసుకొని పచ్చిరొట్ట పైర్లు గ వాడుకోవాలని సూచించారు. ఉద్యాన శాస్త్రవేత్త బి శివ మాట్లాడుతూ రైతులు ఒకే రకమైన పంటలను పండిస్తున్నారు. అందువలన ఇది రైతులకు కూడా గిట్టుబాటు కావడం లేదు. కనుక రైతులు పంట మార్పిడి పాటించడం ద్వారా సుస్థిర ఆదాయాన్ని పొందటంతో పాటు నేలతల్లి ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాక్స్ సీఈఓ, సభ్యులు మరియు అభ్యుదయ రైతులు మరియు 30 మంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మూడు బెల్ట్ షాపుల్లో మద్యం స్వాధీనం



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు అశోక్ నగర్ లో శుక్రవారం సిఐ నాగబాబు, సీఐ వెంకటేశ్వర్లు, సీఐ అశోక్ రెడ్డి ఎస్సై నగేష్ కుమార్, ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ ప్రోగ్రామ్‌లో 80 టూ వీలర్, నాలుగు ఆటోలు స్వాధీనం చేసుకున్నట్లు డి.ఎస్.పి రవీందర్ రెడ్డి తెలిపారు. మూడు బెల్ట్ షాపులపై కేసులు పెట్టడం జరిగిందని తెలిపారు. ప్రజల మధ్యకు వెళ్లి అసాంఘిక శక్తులను పట్టుకునేందుకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం ఉద్దేశం అన్నారు. మణుగూరు పారిశ్రామిక ప్రాంతం ఇతర రాష్ట్రాల నుండి కిరాయికి వస్తుంటారు ఆధారాలు లేకుండా కిరాయికి ఇవ్వద్దు అన్నారు. ఇతర రాష్ట్రాల వారు మీ వద్ద కిరాయికి ఉంటే పోలీసులకు సమాచారం ఇస్తే మేము విచారణ చేస్తాం అన్నారు. అలాగే సైబర్ క్రైమ్ పట్ల, వాహనదారులు హెల్మెంట్, సీట్ బెల్ట్ పై అవగాహన పరచడం జరిగిందని డిఎస్పి రవీందర్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సమితి సింగారం సర్పంచ్ కలవబోయిన మాధవరావు పాల్గొన్నారు.

# సర్పంచ్ జవ్వాజి అశ్వినికి అభినందనలు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం తాటిపూడి గ్రామ సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు శుక్రవారం సూర్యాపేటలో కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర రెండో ఆర్థిక సంఘం సమీక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన స్టేట్ ఫైనాన్స్ కమీషనర్ ఛైర్‌పర్సన్ సిరిసిల్ల రాజయ్య సర్పంచ్‌లకు పలు సూచనలు చేశారు. ఈ క్రమంలోనే తాటిపూడి గ్రామ సర్పంచ్ జవ్వాజి అశ్విని మాట్లాడుతూ ప్రభుత్వం సర్పంచ్‌లు ఇచ్చే అధికారాలతో పాటు ప్రజాధనాన్ని ఏ విధంగా సమకూర్చుకోవాలి అనే దానిపై మాట్లాడిన జవ్వాజి అశ్విని మాటలకు సిరిసిల్ల రాజయ్య, సూర్యాపేట జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు పంచాయతీ అధికారులు ఆమెను మెచ్చుకొని అభినందించారు. అనంతరం సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ ప్రతి పంచాయతీకి సంపద సమకూర్చుకునే విధంగా చూసుకొని ఆ సంపదను నిల్వ చేసుకొని విధంగా చూసుకోవాలని సర్పంచ్‌లకు సూచనలు చేశారు.

# తెలంగాణ ఉద్యమానికి సాహిత్యమే ఊపిరి

**-విద్యా వారోత్సవాల్లో కవి ప్రసేన్**





**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ ఉద్యమానికి సాహిత్యం ఒక ప్రేరణగా, దన్నుగా నిలిచిందని ఎందరో ఉద్యమకారులను సాహిత్యమే తయారు చేసిందని ప్రముఖ కవి, విమర్శకులు, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు ప్రసేన్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సాహిత్య సాంస్కృతిక రంగమే చుక్కానిలా పని చేసిందన్నారు. ఎస్ఆర్ అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న విద్యా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం తెలంగాణ ఉద్యమం  సాహిత్యం అనే అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రసేన్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి రావెళ్ల వెంకట్రామారావు రాసిన పాట ప్రేరణనిచ్చిందని కదనాన శత్రువుల కుత్తుకలను అవలీలగా నుత్తరించిన బలోన్మతులు ఏలిన భూమి నా తెలంగాణ ఇది వీరులకు కాణాచి అన్న పాట ఉద్యమ పదాన ముందు నిలిచిందన్నారు. తెలంగాణ సిద్ధాంత కర్త జయశంకర్‌తో పాటు అనేక మంది కవులు, కళాకారులు తెలంగాణ సాంస్కృతిక, సాహిత్య ఉద్యమానికి దోహదం చేశారన్నారు. తెలంగాణలో పాట ప్రజా జీవితంలో ఒక భాగమైందని అదే దిక్సూచిగా మారిందన్నారు. తెలంగాణలో వచ్చిన వచన కవిత్వం, పాటలు ప్రజా దరణ పొందాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శాస్త్రి, డాక్టర్ శ్రీనివాస్, కళాశాల తెలుగు విభాగాధిపతి రవికుమార్, డాక్టర్ సునంద, అనురాధ, కిరణ్, రమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నామినెటెడ్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి

**-రైతు సంఘం నేత మిడికంటి**




**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినెటెడ్ విధానంలో పాలక మండలిని నియమించే పద్ధతిని ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిడికంటి చిన్నవెంకటరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కేవలం అధికార పార్టీ వారికి మాత్రమే పదవులు దక్కేందుకు ఈ పరిస్థితి ఏర్పడుతుందని ఆయన తెలిపారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని రాజ్యాంగంలోని 243 ఆర్టికల్ ప్రకారం సహకార సంఘాలకు ఎన్నికలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. సహకార సంస్థలు ప్రజాస్వామ్య బద్దంగా వ్యవహరించాలని నామినెటెడ్ పద్ధతి ద్వారా ఇటువంటి చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పుచ్చకాయల సుధాకర్, యడ్లపల్లి శంకరయ్య, వెన్నం భాస్కర్, ఏలూరి భాస్కర్‌రావు, మిడికంటి పెద్దవెంకటరెడ్డి, రామ్మూర్తి, గణపారపు నాగయ్య, రవి, పగిళ్ల వీరభద్రం, చిన్నవీరన్న, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు.

# ప్రజా దర్బార్ దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలన

**పంట పోలాల వద్దనే వెరిఫికేషన్ చేస్తున్న అధికారులు**




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోరకు రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చోరవ తో నిర్వహించిన ప్రజా దర్బార్ దరఖాస్తుల పరిశీలన జరుగుతుంది. మండలం లోని రాయగూడెం, బోదులబండ, గువ్వలగూడెం క్లస్టర్స్ లో నిర్వహించిన ప్రజాదర్బార్ కు రెవిన్యూ కు సంబంధించిన వివిధ సమస్యల పై మొత్తం 714 దరఖాస్తులు అందాయి. వాటిలో సైదాబైనామా, పాసు బుక్, పేర్ల మార్పు ఇతరత సమస్యల పై రైతులు అందించారు. వీటిని నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్ ప్రత్యేక టీమ్లను ఏర్పాటు చేశారు. గ్రామాల వారీగా రెవిన్యూ ధరఖాస్తుల పై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తున్నారు. శుక్రవారం మండలం లోని వివిధ గ్రామాలల జరుగుతున్న పరిశీలన కార్యక్రమం ను తహశీల్దార్ పర్యవేక్షించారు. గ్రామ పంచాయతీ అధికారులు దరఖాస్తు చేసుకున్న రైతుల పంట పొలాల వద్ద కు వెళ్లి పరిశీలించారు. పరిసర ప్రాంతాలలోని రైతులతో పంచనామా నిర్వహిస్తున్నారు. డాక్యుమెంట్స్ విస్తీరణం రికార్డుల ప్రకారం ఉందా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రాంప్రసాద్ మాట్లాడారు... దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిశీలించి సాధ్యమైనంత వరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రెవిన్యూ ఇన్‌స్పెక్టర్స్ ఆలస్యం మధుసూధన్ రావు, అల్లం రవి కుమార్, ఆయా జీపీవో లు ఉన్నారు.

# భగీరథను వెంటనే అరెస్టు చేయాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మైనర్‌కు బలవంతంగా మద్యం తాగించి అత్యాచారానికి పాల్పడిన  బండి సాయి భగీరథపై హైదరాబాద్‌లో ఫోక్సో కేసు నమోదై ఐదు రోజులు కావస్తున్నా నేటికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ శిరోమణి, టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామయ్య, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ తెలిపారు. సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర హోంశాఖ సహయ మంత్రి బండి సంజయ్ దిష్టి బొమ్మను ఆర్ అండ్‌బి గెస్ట్ హౌజ్ ముందు శుక్రవారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానులేనని చెప్పే బిజెపి ప్రభుత్వం చట్ట ప్రకారం  భగీరథను ఎందుకు అరెస్టు చేయడం లేదన్నారు. మైనర్ బాలికకు రాష్ట్ర ప్రభుత్వం భద్రత ఇవ్వాలని, కేసును నిష్పక్షపాతంగా విచారించాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోంశాఖ సహయ మంత్రిగా ఉన్న బండి సంజయ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలన్నారు. భగీరథను వెంటనే అరెస్టు చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆవుల అశోక్, డి. శ్రీను,కె. శ్రీనివాస్, శోభ, చైతన్య, లక్ష్మి , కవిత, వినయ్, సురేష్, శ్రావణ్, సత్తార్ పాల్గొన్నారు.

# ఎస్ఆర్‌అండ్‌బిజిఎన్ఆర్‌లో గ్రంథాలయ జ్ఞానోత్సవం

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఎస్ఆర్‌అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల ఆధ్వర్యంలో మన గ్రంథాలయ జ్ఞానోత్సవం  అనే కార్యక్రమాన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లా ప్రారంభించారు. విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంపొందించడం, పుస్తకాల ప్రాముఖ్యత, గ్రంథాలయాల ఆధునీకరణ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కవి, విమర్శకులు, పూర్వ అధ్యాపకులు సీతారాం, కొండపల్లి శేషు ప్రసాద్, నల్లమోతు తిరుమలరావు, ప్రసేన్, మోదుగు వేలాద్రి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు పుస్తకాలపై సమీక్షించి రచయితలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల గ్రంథాలయంలో 53వేల పుస్తకాలు ఉన్నాయని, 20కు పైగా మ్యాగ్జిన్స్‌కు చందాదారులుగా ఉన్నామని, 35వేల ఈ జనరల్స్ డౌన్‌లోడ్ చేసి చదువుకు వెసులుబాటు ఉందని గ్రంథాలయ బాధ్యులు తెలిపారు. 1962 నుండి 2011 వరకు కళాశాలలో ఉన్న మ్యాగ్జిన్స్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శాస్త్రి, సిహెచ్ శ్రీనివాస్, కో ఆర్డినేటర్ సునంద, గ్రంథాలయ అధికారి విజయ్‌కుమార్, లైబ్రరీ కమిటీ సభ్యులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా విద్యావారోత్సవాలు

**- అలంరించిన సంజన కూచిపూడి నృత్యం**



**ప్రజాపక్షం/భద్రాచలం :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఘనంగా విద్యావారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం ఐదవ రోజు సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రంధాలయ ఉత్సవం ఘనంగా జరిగిందియ బిజెడ్‌సి మొదటి సం. విద్యార్ధిని మడిపల్లి సంజన కూచిపూడి నృత్యం అందరినీ అలరించింది. నందిని దేశభక్తి గీతం, తెలుగు అధ్యాపకులు డా. సుబ్బరాజు ఏక పాత్రాభినయం ఆహుతులను ఆకట్టుకుంది. అనంతరం గ్రంధాలయ ఉత్సవంలో భాగంగా గ్రంధపాలకుడు జానీ పాల్గొని విద్యార్థులకు గ్రంధాలయం ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సంఘ సేవకర్త,శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షులు, ఐటిసి కాంట్రాక్టర్ పాకాల దుర్గా ప్రసాద్ ముఖ్యాతిధిగా హాజరై విద్యార్థులను ఉత్తేజ పరిచారు. అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా. జాన్ మిల్టన్, డా. నండూరి రాంబాబు, అధ్యాపక, అద్యాపకేత బృందం తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాలకు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలి



**ప్రజాపక్షం/అశ్వాపురం :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు(కోఆపరేటివ్ సొసైటీలకు)ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అశ్వాపురం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ పార్టీ, ఏఐకేఎస్ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పిలుపుమేరకు ఈనెల 14,15 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘాల ఎన్నికల కోసం ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఆ పిలుపులో భాగంగా అశ్వాపురం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రతి సహకార సంఘంలో 13 మంది సభ్యులతో పాలక మండలిని ఏర్పాటు చేసి పాలక పార్టీ నాయకులను అధ్యక్షులు, డైరెక్టర్లుగా నామినేట్ చేయాలని చూడటం రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శివ వేల్పుల మల్లికార్జున్, నెల్లిపాక సొసైటీ వైస్ ఛైర్మన్ కమటం సురేష్, ఏఐటీయూసీ మండల గౌరవ అధ్యక్షులు జక్కుల రామచంద్రరావు, సిపిఐ మండల సమాయ కార్యదర్శులు మేలపుర సురేందర్‌రెడ్డి, రాయపూడి రాజేష్, కొండపర్తి ప్రసాద్, ముత్తబోయిన వెంకటేశ్వర్లు, ఈనపల్లి పవన్ సాయి, కొత్తపల్లి సీతారాములు, అక్కెరపల్లి నాగేంద్రబాబు, కణితం ఉపేందర్, తెల్లం వెంకటరమణ, తెల్లం రాజు, బండ్ల తిరుపతయ్య, చెలికాని శ్రీనివాస్, గద్దల రాము, కంచర్ల మురళి, తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తి డ్రైనేజీ పనులతో ప్రజలకు ఇబ్బందులు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలం లోని మొండికుంట గ్రామంలో మెయిన్ రోడ్డుకు ఇరువైపులా చేపట్టిన డ్రైనేజీ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో మురుగునీరు రోడ్డుపైకి చేరి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగకపోవడంతో దోమలు, ఈగల బెడద పెరిగి వ్యాధుల భయం నెలకొంది. వానాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశముందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ గుత్తేదారు పనులను మధ్యలోనే నిలిపివేయడంతో సమస్యలు మరింత తీవ్రమయ్యాయని తెలిపారు. పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు, గుత్తేదారు స్పందించడం లేదని గ్రామస్తులు వాపోయారు. ఈ సమస్యపై శుక్రవారం మొండికుంట గ్రామ పంచాయితీ సర్పంచ్ మర్రి సంధ్య మల్లారెడ్డి, ఉప సర్పంచ్ శివారెడ్డి ఆర్‌అండ్‌బి సూపరింటెండెంట్‌ను కలిసి మెమోరాండం సమర్పించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని వారు కోరారు.